
విక్రయానికి సిద్ధంగా ఫ్లవర్ బొకేలు


బేకరీలో కేక్స్ కోసం ఎగబడుతున్న జనం

కోటి ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం

సంబరాల్లో మునిగి తేలిన నియోజకవర్గ ప్రజలు



ఫుల్ జోష్

కాల గమనంలో మరో ఏడాది గడిచిపోయింది. కొన్ని మధుర స్మృతులు.. మరికొన్ని చేదు జ్ఞాపకాలను మిగిల్చి 2024 సంవత్సరం ముగిసింది. కోటి ఆశలతో, కొంగొత్త లక్ష్యాలతో 2025 సంవత్సరానికి విశాఖ ఉత్తర నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘన స్వాగతం పలుకుతున్నారు. ముఖ్యంగా యువత తమదైన శైలిలో నూతనోత్సాహంతో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. స్నేహితులతో పార్టీలు, డిన్నర్, కేక్ కటింగ్ వంటి సెలబ్రేషన్స్‌తో న్యూ ఇయర్‌కు ఘన స్వాగతం చెప్పడానికి సిద్ధమయ్యారు. కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలతో, సరికొత్త ప్రణాళికతో విజయపథాన ముందుకు సాగాలని నిర్ణయాలు తీసుకున్నారు. గత సంవత్సరం కంటే న్యూ ఇయర్‌లో మరింత ఉన్నతి సాధించడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

– సీతంపేట

అంతటా న్యూ ఇయర్ సందడే

న్యూ ఇయర్ వేడుకలతో మార్కెట్లలో సందడి నెలకొంది. స్వీట్ షాప్‌లు, బేకరీలు, పూల బొకేల దుకాణాలు, ఫ్రూట్‌షాప్స్, గిఫ్ట్ షాప్స్ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. వేడుకల్లో భాగంగా రాత్రి విందు చెయ్యడానికి బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, క్లౌడ్ కిచెన్స్ వద్ద జనం కొనుగోళ్లతో రద్దీ నెలకొంది. దీంతో సీతంపేట, అక్కయ్యపాలెం, సీతమ్మధార, మురళీనగర్, మద్రిపాలెం, కంచరపాలెం ప్రాంతాల్లోని ప్రధాన బజార్లలో బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ దుకాణాలు, స్వీట్‌షాప్‌లు, బేకరీలు వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. బేకరీలు సైతం వినియోగదారుల అభిరుచికి తగినట్టు కేక్‌లు సిద్ధం చేసి విక్రయించాయి. న్యూ ఇయర్ విషెష్ చెప్పేందుకు ఆకర్షణీయంగా తయారు చేసిన పూలబొకేలు పెద్ద ఎత్తున అమ్ముడుపోయాయి.


స్వీట్ షాప్‌లో కొనుగోలుదారుల రద్దీ



ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా

నేను బీటెక్ పూర్తి చేశాను. గత నాలుగేళ్లుగా బ్యాంక్స్, రైల్వేలో జాబ్ కోసం పబ్లిక్ లైబ్రరీలో ప్రిపేర్ అవుతున్నాను. 2025 కొత్త సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని నిర్ణయం తీసుకున్నాను. ఆ దిశగా ప్రత్యేక ప్రణాళికతో చదివి విజయం సాధిస్తా.

– ఎస్.గౌరీ శంకర్, బీటెక్ విద్యార్థి



తెలుగు టీచర్ అవుతా..

నేను ఎంఏ తెలుగు చదివాను. తెలుగు టీచర్ కావాలని న్యూయర్ రిజల్యూషన్‌గా తీసుకున్నాను. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందని ఇటీవల ప్రకటించింది. ఆ పరీక్ష రాయడం కోసం కొద్ది నెలలుగా ప్రిపేర్ అవుతున్నాను. 2025లో ప్రభుత్వ టీచర్ కావాలని పట్టుదలతో గట్టి నిర్ణయం తీసుకున్నాను.

– ఎన్.శారద, విద్యార్థిని

శతశాతం ఉత్తీర్ణత సాధిస్తాం

2025లో మా పాఠశాల టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని అనుకున్నాను. మా స్కూల్‌లో టెన్త్ చదువుతున్న ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాను. ఇందుకోసం చదువులో వెనుకబడిన విద్యార్థులు పాస్ మార్కులు సాధించేలా అన్ని సబ్జెక్టు టీచర్ల సాయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటాను.



– శాంతికుమారి, హెచ్‌ఎం, మధురానగర్ హైస్కూల్.

నేషనల్స్‌లో విజయం సాధిస్తా

ఈ కొత్త సంవత్సరంలో కరాటే నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో గెలవాలని అనుకుంటున్నా. నేను గత పదేళ్లుగా కరాటేలో శిక్షణ పొందుతున్నా. జిల్లా, యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందాను. గత నెల బోపాల్‌లో జరిగిన సౌత్ వెస్ట్ పోటీల్లో ఏయూ తరఫున ఐదుగురు పాల్గొనగా నేను ఒక్కడినే నేషనల్స్‌కు ఎంపికయ్యాను. ఈ నెల 15 నుంచి హర్యానాలో జరగనున్న నేషనల్ కరాటే పోటీల్లో పాల్గొంటున్నా. విజయం సాధించాలని పట్టుదలతో కృషి చేస్తున్నా.

– వి.బాల సూర్య, క్రీడాకారుడు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ద్వారకానగర్ ప్రతినిధులు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ జి.వి.కుమార్, సెక్రటరీ పి.జి.ప్రసాద్, చైర్‌పర్సన్ స్వతంత్రకుమార్, బోర్డు మెంబర్ ఎం.వి.వి.సత్యనారాయణ, సభ్యులు పి.ఎస్.వి.గణేష్, పి.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.విశ్వనాథం చేతుల మీదుగా 123 మంది విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరస, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆసక్తికరంగా వైజ్ఞానిక ప్రదర్శన


సైన్స్ నమూనాలతో విద్యార్థులు

మురళీనగర్ : మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గోపాలపట్నం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ఆసక్తికరంగా సాగింది. జోన్ – 5 జోనల్ కమిషనర్ బి.రాము పోటీలను ప్రారంభించారు. మండలంలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. విద్యార్థుల వ్యక్తిగత ప్రాజెక్టులు 10, సామూహిక ప్రాజెక్టులు 14, ఉపాధ్యాయుల వ్యక్తిగత విభాగంలో 6 ప్రాజెక్టులు ప్రదర్శించారు.

జోనల్ కమిషనర్ బి.రాము ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు. వ్యక్తిగత విభాగంలో ఏపీఎస్‌డబ్ల్యూఎస్ మేఘాద్రి గెడ్డ పాఠశాల విద్యార్థి కె.సోనిక తయారు చేసిన హైడ్రాలిక్ మెషీన్ లాంచింగ్, గ్రూప్ ప్రాజెక్ట్ విభాగంలో కె.లోహిత, వై.హిమబిందు తయారు చేసిన ఆటోమేటిక్ సేఫ్టీ ఆక్సిడెంట్ అలర్ట్ సిస్టం, ఉపాధ్యాయుల వ్యక్తిగత ప్రాజెక్టుకి సంబంధించి గోపాలపట్నం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు బి.లలిత ప్రసాదరావు తయారు చేసిన మ్యాథ్స్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 3న తోటగరువు ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. పాఠశాల హెచ్‌ఎం బి.హేమలత పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇతర పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న జెడ్పీ రాము

అబ్బురపరిచిన సైన్స్ ఎగ్జిబిషన్

సీతమ్మధార : స్థానిక వసంతబాల పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ఘనంగా ప్రారంభమైంది. సీతమ్మధార మండల పరిధిలోని ఆరు ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నమూనాలు పలువురిని అబ్బురపరిచాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలు కావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 31 నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీతమ్మధార మండల విద్యాశాఖాధికారులు డి.రామారావు, కేఏ బాలామణి, హెచ్‌ఎం కె.రాము, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

సీతమ్మధార : రాష్ట్రంలో పింఛనర్లకు ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో లబ్ధిదారులకు పింఛన్ మొత్తాలను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లలో స్పౌజ్ కేటగిరీని కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం చేర్చిందన్నారు ఇందులో భాగంగా పెన్షన్ పొందుతున్న వ్యక్తి చనిపోతే అతని భార్యకు ఈ కేటగిరీ కింద ఈ నెల నుంచే పింఛన్ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, యూసీడీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పుణ్యవతి, బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక పాల్గొన్నారు.

పోర్టు యాజమాన్యమే ఆస్పత్రిని నిర్వహించాలి


పోర్టు హాస్పిటల్ వద్ద దీక్షలో నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ, పోర్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 92వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించడానికే పోర్టు హాస్పిటల్‌ను కార్పొరేట్‌కు ఇస్తున్నామని చెప్పడం అబద్ధమని... విలువైన భూములను చౌకగా కాజేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. గత 92 రోజులుగా పోరాటం చేయడం వల్లే హాస్పిటల్ టెండర్లు వేయడానికి వెనకడుగు వేశారన్నారు. సుమారు 40 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించే ఆస్పత్రిని ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న పోర్టు యాజమాన్యమే ఆస్పత్రి నిర్వహణ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కె.సత్యనారాయణ, వీఎస్ మూర్తి, కేఎస్ కుమార్, రాఘవులు, విజయ్‌కుమార్, నాయుడు, ప్రభుదేవా, అన్నపూర్ణ, బాలకృష్ణ, లక్ష్మీ, దేవి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వ్యక్తి


రామ్మోహనరావుని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

సీతమ్మధార : ఇంట్లో నుంచి వచ్చేసిన వృద్ధుడిని నాలుగో పట్టణ పోలీసులు పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోర్ట్ స్టేడియం వెనుక గణేష్ నగర్‌లో నివసిస్తున్న మోటూరి రామ్మోహన్‌రావు (63) ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్లిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 24 గంటల్లోనే పోలీసులు సదరు వృద్ధుడిని పట్టుకుని అప్పగించారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందికి రామ్మోహన్‌రావు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

వెన్న దీపాలతో నీరాజనం


కల్యాణ వేంకటేశ్వరునికి వెన్న దీపాలతో నీరాజనం సమర్పిస్తున్న భక్తులు

సీతంపేట : అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 16వ రోజు శ్రీభూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరునికి భక్తులు వెన్నతో దీపాలు వెలిగించి నీరాజనం సమర్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా సుప్రభాతం, అర్చన, బాలభోగం, పాశుర విన్నపం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా జనవరి 2న తిరుప్పావడ సేవ నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : మద్రిపాలెం ప్రాంతానికి చెందిన మహమ్మద్ హరిపాలికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం మంజూరైంది. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం హరిపాలికి రూ.43వేల చెక్కు అందజేశారు. హరిపాలి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అతను కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ఎమ్మెల్యే సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం సదరు వ్యక్తికి సీఎం సహాయనిధి నుంచి డబ్బులు విడుదల చేసింది. కార్యక్రమంలో బాధితుని తల్లి, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అజాత శత్రువు లక్ష్మణరావు

మురళీనగర్ : అందరివాడిగా, అజాత శత్రువుగా డాక్టర్ బీవీ లక్ష్మణరావు అందరి మన్ననలు పొందారని వక్తలు కొనియాడారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు పదవీ విరమణ సందర్భంగా మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. తనకు చేసిన సత్కారానికి లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

నాట్య కళాక్షేత్రం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వెంకట్ చిన్నారావు, తదితరులు

సీతమ్మధార : స్థానిక షిరిడీ సాయిబాబా మందిరం వద్ద నాట్యం నాట్యకళాక్షేత్రంలో మంగళవారం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌ని నాట్య కళా క్షేత్ర నాట్య గురువు కె.వెంకట్ చిన్నారావు, కళాక్షేత్రం ప్రిన్సిపాల్ కె.మాధవి నృత్య విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీ డెంటల్ కేర్ జనరల్ మేనేజర్ రమేష్, విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటరమణారావు, నాట్య రవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ యు.మహేష్‌బాబు, ఎస్.నాగేశ్వరరావు, రంగస్థల దర్శకుడు పి.వి.రమణమూర్తి, డి.రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా అంధుల క్రిస్మస్ వేడుకలు


బహుమతులతో అంధ విద్యార్థులు

సీతంపేట : దైవ సన్నిధి, సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుమారు 400 మంది అంధులు పాల్గొన్నారు. ఏసును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. క్రీస్తు ప్రాముఖ్యతను తెలియజేస్తూ వేసిన స్కిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారికి బహుమతులతోపాటు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస్ కె శైలస్ మాట్లాడుతూ సహాయ ఫౌండేషన్ ద్వారా గత 10 ఏళ్లుగా మానసిక రోగులు, అంధులు, అనాథలకు సేవ చేస్తూ, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు.